క్లుప్తంగా

పెద్ద చెరువుకు జలకళ



మరికల్: ఇటీవల కురిసిన వర్షాలకు తీలేర్ పంపుహౌస్ నుంచే వచ్చే నీటితో మరికల్ పెద్ద చెరువుకు జలకళ సంతరించుకుంది. చెరువు పూర్తి స్థాయిలో నిండటంతో నీరు అలుగు ద్వారా దిగువ ఉన్న ఇబ్రహీంపట్నం చెరువుకు చేరుతుంది. పెద్ద చెరువు ఒకసారి నిండితే మరికల్‌లో ఏడాది పాటు నీటి సమస్య ఉండదు. ఇప్పటికే గ్రామంలో ఉన్న బోర్లలో భూగర్భ జలాలు పెరగడం విశేషం. అలాగే తీలేర్, అప్పంపల్లి, కన్మనూర్ చెరువుల్లో భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుడెబల్లూర్‌లో వనమహోత్సవం



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది అధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయగౌడ్ పొలంలో ఈత చెట్లను నాటారు.'ఈత చెట్లను పెంచుదాం-కులవృత్తిని కాపాడుదాం' అంటూ ప్రతి గీత కార్మికుడు కూడ ఈతచెట్లను పెంచి, ఈత కల్లును విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఎస్ఐ శిరీష, గౌడ సంఘం జిల్లా నాయకుడు విజయగౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

మద్దూరు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ గోవిందరాజులు పేర్కొన్నారు. మంగళవారం మద్దూరు పట్టణంలోని బాలుర, దోరేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర పాఠశాలలోని ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, తరగతి గదులను పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పాఠాలను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, గుండుమాల్ ఎంఈఓలు ఆంజనేయులు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి



మాగనూర్: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు వారానికి రెండుసార్లు ఫిజియోథెరపీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 0–18 ఏళ్ల పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పి స్పెషల్ ఎడ్యుకేటర్ గోపాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



దామరగిద్ద: మండలంలోని మొగుల్‌మడ్క పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తాచాటారు. వైశాలి 600 మీటర్ల రన్నింగ్‌లో కోమలి, స్వాతి, వీవాని, వెంకటేష్, రోషన్, నవీన్‌లు వివిధ క్రీడల్లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారు. దీంతో మంగళవారం పాఠశాల జీహెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

ఆత్మకూర్: ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు అన్నారు. మంగళవారం ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో పలువురు ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా భూమిపూజ చేసి నిర్మాణాలు ప్రారంభించారు. కార్యక్రమంలో రవీందర్, వంశీ, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనం.. నిరుపయోగం

- నిర్వహణ లేక నీరు గారుతున్న లక్ష్యం
- పిచ్చి మొక్కలతో నిండిపోయిన వైనం
- తుప్పు పడుతున్న వ్యాయామ పరికరాలు



వ్యాయామం చేసేందుకు వీలు లేకుండా పెరిగిన పిచ్చిమొక్కలు

ధన్వాడ: మండల కేంద్రంలో దాదాపు రూ.11 లక్షలతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం నిరుపయోగంగా మారింది. ప్రజలు సేదతీరేందుకు పట్టణ కేంద్రాల్లో పల్లె ప్రకృతి వనాలు నిర్మించాలని 2021లో అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భగంగా జిల్లాలో మొదటగా ధన్వాడలో పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కేవలం ఆట వస్తువులకే రూ.3 నుంచి 4 లక్షలు ఖర్చు చేశారు. అలాగే పూల మొక్కల కోసం రూ. 2.40 లక్షలను వెచ్చించారు. మొత్తం ప్రకృతి వనం ఏర్పాటు కోసం రూ.11 లక్షలు వ్యయం చేసి ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం సరైన నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు భారీగా పెరిగి అక్కరకు రాకుండా తయారైంది. పిల్లలు ఆడుకునే వస్తువులు విరిగిపోయాయి. వ్యాయామం చేసే పరికరాల చుట్టూ ముళ్ల పొదలు పెరిగి అటువైపు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా నిండుకున్నాయి. ప్రస్తుతం పూలమొక్కలు పూర్తిస్థాయిలో ఎండిపోయాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది పల్లె ప్రకృతివనంపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు వాపోతున్నారు.

చిన్నారులు ఆటలకు దూరం..

చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పటు చేసిన జారుడు బల్ల, ఊయల, రంగుల రాట్నం తదితర పిల్లలు ఆడుకునే సామగ్రి మొత్తం విరిగిపోయి అధ్వానంగా తయారైంది. అలాగే పెద్దలు శారీరక ఆరోగ్యం కోసం ఏర్పాటుచేసిన జిమ్ వస్తువులు నిరుపయోగంగా మారాయి. దీంతో పల్లె ప్రకృతి వనంకు వస్తున్న చిన్నారులు నిరుత్సాహంతో వెనుతిరుగుతున్నారు.



తుప్పుపట్టి విరిగిపోయిన ఊయల

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

పల్లె ప్రకృతివనాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. ఉదయం సాయంత్రం గ్రామ పంచాయతీ సిబ్బంది పార్కును తెరచి ఉంచుతున్నారు. మధ్యాహ్నం సమయం, రాత్రి సమయంలో మూసి ఉంచుతున్నారు. దీంతో మూసి ఉన్న సమయంలో అమ్మాయిలు, అబ్బాయిలు పార్కు కంచెను వంచి దానిపై నుంచి లోనికి దూకి వెళ్తున్నారని, మందుబాబులు లోపలికి వెళ్లి మద్యం తాగుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి

పూర్తిగా పిచ్చి మొక్కలు పెరిగి వాకింగ్ చేసేందుకు కూడా వీలు లేకుండా పోయింది. వ్యాయామం చేద్దామంటే సామగ్రి అంతా విరిగిపోయి వాటి చుట్టు పిచ్చిమొక్కలు పెరిగాయి. పిల్లలు ఆడుకునే వస్తువులు కూడా విరిగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మళ్లీ వినియోగంలోకి తీసుకొస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– ఓం భగవత్, మారుతీనగర్ కాలనీ, ధన్వాడ

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు



మాగనూర్: మండలంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర మాట్లాడుతూ.. 317 జీవో బాధితుల మానసికవేదనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని న్యాయం చేయాలన్నారు. పెండింగ్‌లోఉన్న డీఏ, పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న యూపీఎస్ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సంఘం నాయకులు హైమవతి, స్పందన, రాజు, శ్రీవిద్య, పరందాములు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

కొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన కలాల్ సత్యనారాయణకు చెందిన ఇల్లు కూలిపోయింది. వారం రోజులుగా కురిసిన వర్షానికి ఇల్లు లోపలి భాగం మొత్తం కూలిపోయింది. సత్యనారాయణ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మంగళవారం స్వగ్రామానికి వచ్చి తాళం వేసిన ఇంటిని తెరిచి చూడగా లోపలి భాగం కూలి పోయింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ జయరాములు తెలిపారు.

రెడ్డి సేవా సమితి మండల కమిటీ ఎన్నిక

కోస్గి: రెడ్డి సేవా సమితి ఉమ్మడి కోస్గి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఏబీకే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలు గ్రామాల రెడ్డి కులస్తులు పాల్గొని మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో రెడ్డి సేవా సమితి మండల అధ్యక్షుడిగా తూం భీంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా దశరథ్ రెడ్డితో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎల్లమ్మ దేవాలయం నిర్మాణానికి మంగళవారం కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ అనిత చెన్నయ్య గ్రామపెద్దలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఆలయానికి దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేయుటకు కృషి చేస్తానని అనిత చెన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో హనుమంతు, చన్నయ్య, కొండప్ప, తిరుపతయ్య, మల్లేష్, శ్యామప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

ధన్వాడ: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు యువజన సంఘం మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని గ్రామాల మాజీ బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

చేయూత పింఛన్ రూ.4వేలకు పెంచాలి



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం రాష్ట్ర నాయకులు జగ్గయ్య

మద్దూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేయూత పింఛన్లను రూ.4వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలు, కండరాల క్షీణత ఉన్నవారికి రూ.15వేలు పింఛన్ మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందెరాములు, రాష్ట్ర అధ్యక్షుడు కొళ్ల జగ్గయ్య డిమాండ్ చేశారు. పింఛన్ల పెంపుకోసం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 13న ఎల్‌బీ స్టేడియంలో దివ్యాంగుల మహాగర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాగర్జనకు సన్నాహక సమావేశంగా ఆగస్టు 2న కొడంగల్‌లో నిర్వహిస్తున్న మహాసభకు దివ్యాంగులు పెద్ద సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, మండల నాయకులు రాములు, ఉమేష్‌బేగం, రవిపాల్‌రెడ్డి, శంకర్ నాయక్, గోపాల్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

కోస్గి: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2న కొడంగల్‌లో నిర్వహించనున్న చలో కొడంగల్ మహాసభను విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్‌చైర్మన్ అందె రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్ అన్నారు. పట్టణంలోని దివ్యాంగులతో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ హాజరయ్యే ఈ మహాసభకు అధిక సంఖ్యలో వికలాంగులు, చేయుత పెన్షన్‌దారులు హాజరుకావాలన్నారు. ఎన్నికలకు ముందు దివ్యాంగులకు రూ.6000, చేయూత పెన్షన్ రూ.4000 పెంచుతామని ప్రకటించి అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోపాల్, రాఘవేందర్, సయ్యద్ సలీం, శ్రీనివాస చారి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

మాగనూర్: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. మంగళవారం మాగనూర్ గ్రామపంచాయతీ ఆవరణలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించి, ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దండు ఆనంద్, నాయకులు చక్రపాణి, శ్రీనివాసులు, దండు బస్వరాజు, డీలర్ నారాయణ, నాగేశ్వరి , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శ్రీకాంత్

మద్దూరు: మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని పుర కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. మంగళవారం మద్దూరు పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రతి విద్యుత్ స్తంభానికి వార్డు సంఖ్యతో కూడిన కోడింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసినప్పుడు ఈ కోడింగ్ నెంబర్ చెబితే వెంటనే సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తారన్నారు. అలాగే పట్టణంలో వీధి లైట్లను పరిశీలించి, లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి



మరికల్‌లో నాగుల విగ్రహాలకు పాలు పోస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పుట్టల్లో పాలు పోసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

❖ మరికల్‌లోని పాత కుర్వగేరి మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి పూజలు జరిపించారు. నాగుల విగ్రహాలకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని అప్పంపల్లి, మాధవరం, తీలేర్, కన్మనూర్, జిన్నారం, ఎలిగండ్ల పస్పుల తదితర గ్రామాల్లో కూడా నాగుల పంచమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.

❖ కృష్ణా మండలంలోని కున్సీ గ్రామంలో నాగుల విగ్రహాలకు గ్రామస్తుల ఆధ్వర్యంలో అభిషేకం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

❖ ఊట్కూరులోని పులిమామిడి, బిజ్వార్, చిన్నపొర్ల, పగిడిమారి, ఊట్కూరు తదితర గ్రామాలలో నాగుల విగ్రహాలకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి నాగపంచమిని జరుపుకొన్నారు.

❖ ధన్వాడలో మహిళలు నాగులకు పాలు పోసి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం పాలు పోసిన గొబ్బెరలకు దారాలు కట్టి చిన్నారులు ఆటలు ఆడుతూ సందడి చేశారు.



కున్సీలో భక్తుల పూజలు

'అభివృద్ధితోనే సమాధానం చెబుతా'



పాథర్చేడ్‌లో సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

నర్వ: ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధితోనే సమాధానం చెబుతానని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం నర్వ మండలంలో రూ.18 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. 18 నెలల్లో రూ.122 కోట్లను నర్వ మండల అభివృద్ధికి కేటాయించినట్లు పేర్కొన్నారు. మండలంలో బీటీ రోడ్డులేని గ్రామాలు లేకుండా చూసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాయికోడ్ గ్రామంలో త్వరలో 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కోసం మరోసారి వస్తానన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందే విధంగా ఉచిత కరెంటు, ఉచిత బస్సు, రూ.500కే సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, హన్మంతు, బీసం చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

రైతుల సమ్మతితో భూసేకరణ చేపట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రాములు

దామరగిద్ద: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా రైతుల సమ్మతి లేకుండా భూ సేకరణ చేపట్టడం చట్ట విరుద్ధమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, హైకోర్టు న్యాయవాది ప్రశాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ నిర్వాసితుల సదుస్సుకు వారు హాజరై మాట్లాడారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా ధర నిర్ణయించి 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి మార్కెట్ విలువలకు మూడింతలు పెంచి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమ్మతితోనే భూసేకరణ చేపట్టాలన్నారు. బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, మహేష్‌గౌడ్, దానప్ప,బాల్‌రాం, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, సంతోస్, చంద్రశేఖర్, సిత్యానాయక్, హన్మంతు రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం అందించాలి



మక్తల్: కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు అందించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మక్తల్‌లో ఈ నెల 31న కలెక్టరేట్ ముందే జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ చేయాలని కోరారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు జిల్లా నలుమూలల నుండి కార్మికులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కులిమి రాములు, పద్మక్క, నరేష్, నరేందర్, బండారి బాలు, అంజన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి



నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని మాజీ సర్పంచ్ సాయిబన్న కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ కార్యాలయంలో గ్రామ ప్రజలతో కలిసి వినతిపత్రం అందించారు. పాఠశాలలో 1నుంచి 8వ తరగతి వరకు 265 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ఇంత మంది విద్యార్థులకు కేవలం ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా టీచర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో శివప్ప, ప్రహ్లాద్, ఆనంద్, నరేష్, సాయిలు, లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసి మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్‌కు చెందిన తెలుగుకృష్ణకు చెందిన సెల్‌ఫోన్ ఫిబ్రవరి 16న చోరీకి గురైంది. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చిన్నచింతకుంటలో ఉన్నట్లు ట్రేస్‌చేసి స్వాధీనం చేసుకుని కృష్ణకు అప్పగించినట్లు తెలిపారు.

నేడు ఆత్మకూర్‌కు మంత్రుల రాక



ఆత్మకూర్: ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి బుధవారం రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, సీతక్కలతోపాటు క్రికెటర్ అజారుద్దీన్, రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ సీతమ్మ, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ నాగరాజుగౌడ్‌తోపాటు పలువు హాజరవుతున్నట్లు ఎండీ రహ్మతులా ఒక ప్రకటనలో తెలిపారు. రేచింతల, వీరరాఘవపూర్, తిప్డంపల్లిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అలాగే జగ్జీవన్‌రాం విగ్రహ ఆవిష్కరణ, మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

గురుకులాల్లో 31న స్పాట్ అడ్మిషన్లు

దేవరకద్ర రూరల్: చౌదర్‌పల్లి సమీపంలోని స్విట్స్ కళాశాలలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలుర)లో 2025–26 విద్యా సంవత్సరానికిగానూ ఎంపీసీ, బైపీసీలో జూలై 31న స్పాట్ అడ్మిషన్లు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

పంటలను కాపాడుకోవాలి

అమరచింత: వరి, మొక్కజొన్న పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని ముందస్తుగా గుర్తించి సరైన సమయంలో మందులను పిచికారీ చేయడం ద్వారా పంటలను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని ఏఓ అరవింద్ అన్నారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. కత్తెర, సుడిపురుగు ఆశించినపుడు కారబోఫురాన్ 3 శాతం లేదా ఫిప్రోనిల్ 0.3శాతం గుళికలు మొక్క సుడిలో వేసుకుంటే ఫలితం ఉంటుందన్నారు.